# ముక్త

అరేబియా అలల్ని బంధించేసిన మెరైన్‌డ్రైవ్ మీద వెళ్తున్న వాహనాలని చూస్తోంది ముక్త.

చేతిలో మెనూకార్డ్. బృంద పరిచయం చేసిన ఆ రెస్టారెంట్‌లో కార్డ్ చూడకుండానే తనకి కావల్సినవి ముక్త ఆర్డర్ చేయగలదు.

కదులుతున్నట్టు తెలియనంత మెల్లగా తిరుగుతోన్న ఈ రొటేటింగ్ రెస్టారెంట్‌కి ఎప్పుడొచ్చినా జిన్ తాగటం బృందకి భలే ఇష్టం. ముక్తకి వోసారి బృంద జిన్ ఆర్డర్ చేసింది. మొదటిసారి తటపటాయిస్తూనే తాగింది. ఘాటైన లిమ్కా తాగుతోన్నట్టుంది. తర్వాత్తర్వాత ఎప్పుడొచ్చినా ఆమెకి జిన్ తాగటం అలవాటైపోయింది.

గ్లాస్ ఖాళీ అయ్యేలోగా వున్నచోటు నుంచి ఈ రెస్టారెంట్ ఏ దరికి తనని తీసుకువెళుతుందో చూడటం ముక్తకి సరదా!

ఒక్కోసారి సముద్రానికి దగ్గరగా, మరోసారి కొబ్బరిచెట్లకి చేరువగా, కొన్నిసార్లు గోడల వేపుగా.

స్టీవర్డ్ ట్రేతో వచ్చి ఆమె ముందు స్వీట్‌లైమ్‌సోడా, క్రిస్టల్‌మగ్‌లో జిన్ వుంచాడు. గ్లాసులోని స్టిక్‌కి వో వైపు చెర్రీఫ్రూట్. కింద పల్చగా నిమ్మకాయ చెక్క. లైమ్‌సోడాలో జిన్ పోసి స్టిక్‌తో కలయబెట్టి సిప్ చేసింది- వొగరు తక్కువనిపిస్తే మరికాస్త జిన్ గ్లాసులో పోసింది.

తిరిగి సిప్ చేస్తుంటే - 'చుప్. అల్లరి చేయకండి. తన గొడవెందుకు. ఆ సీటు చెల్లికి ఇచ్చేసై' రెస్టారెంట్ నిశ్శబ్దంలో ఎంత చిన్నగా అన్నా స్పష్టంగా వినిపిస్తున్న మాటలు.

ముక్త కొంచెం తలెత్తి తన ఎదురుగా వున్న టేబుల్ వేపు చూసింది.

భార్య, భర్త, ఇద్దరు పాపలు.

విండోసీట్ కోసం చిన్నపాప పెద్దపాపతో పోట్లాడుతోంది.

పెద్దపాప లేచి ఆ సీట్ చెల్లాయికి ఇచ్చేసింది.

ఆదేశాలు. పసితనం నుంచే జీవితాలని కత్తిరించి క్రోటన్ మొక్కల్లా పెంచాలనే ఆంక్షలు.

వీటిని మర్చిపోవాలని ముక్త ఎంతగా ప్రయత్నించినా ఎంత దూరానికి వెళ్ళిపోయినా అవే దృశ్యాలు వెంటాడుతున్నాయి.

స్టీవార్డ్ వొచ్చి ముక్త ముందు వినయంగా నిల్చున్నాడు.

అతనికి ఫుడ్ ఆర్డర్ చేయాల్సివుంది. అంటే తనకిష్టమైన ఆహారాన్ని ఆర్డర్ చేసి తన టేబుల్ దగ్గరకి రప్పించుకోగల స్థానంలో వుంది.

అయినా ముక్త అతనికి ఫుడ్ ఆర్డర్ చేయలేదు.

"బఫేకి వెళ్తాను" అని స్టీవార్డ్‌ని పంపించేసింది.

ముక్త తన టేబుల్ దగ్గర నుంచి లేచి బఫే అరేంజ్ చేసిన ప్రదేశానికి వెళ్ళింది.

ఓ ప్లేట్ తీసుకొని అక్కడ అమర్చిన పదార్థాలని వోసారి చూసింది.

రంగురంగుల పళ్ళు. అనేక వర్ణాలతో మెరిసిపోతున్న సలాడ్స్. తళతళలాడే వెజ్‌నాన్‌వెజ్ డిషెస్. ప్రతి పాత్రమీదా వంటకాలని తెలిపే లేబిల్స్ అతికించివున్నాయి. ప్లేన్‌రైస్, జీరా రైస్, ఫ్రైడ్‌రైస్.

ప్లేట్ పట్టుకొని, వేటిని ముందు వడ్డించుకోవాలా అని ఆలోచిస్తూ నిలబడిపోయింది. ఎన్నిసార్లు చూసినా ఎప్పుడూ తనకేం తినాలనుందో తెలీని స్థితి. అలా అని తనకేం ఇష్టమో తెలీని పరిస్థితేం కాదు. ఆమెకి చేపల కూరంటే ఇష్టం. కానీ ఏ ముల్లన్నా గుచ్చుకుంటుందేమోనని భయం. బోన్‌లెస్ ఫిష్ అన్నా ఆమెకి భయమే. ఎక్కడన్నా ఓ ముల్లు వుంటుందేమోనని.

ఆమె ప్లేట్‌లో కొన్ని సలాడ్ ముక్కలు వేసుకుంది. కొద్దిగా జీరారైస్ తీసుకొని చేపముక్కలు ఎన్ని వేసుకోవాలో అని ఆలోచిస్తూ నిలబడింది. రెండు ముక్కలు వేసుకొని మరోముక్క వేసుకోవాలని అనిపించినా 'ఎవరైనా చూస్తారేమో! మరీ ఆబగా వేసుకున్నాననుకుంటారేమో!' అనుకుంటూ వెళ్ళి తన టేబుల్ దగ్గర కూర్చుంది. చుట్టూ చూసింది. ఎవరూ ఆమె వేపు చూడటం లేదు.

అసలు ఎవరూ మరొకర్ని పట్టించుకోవడం లేదు. ఎవరి తిండి హడావిడి వాళ్ళది. 'తనే అందర్నీ అనవసరంగా పట్టించుకుంటోందా' - ముక్తకి అనుమానం వేసింది.

నిజంగా ఇది వొట్టి అనుమానమేనా?

ఆమె చూపుని ఎంత వొద్దనుకున్నా పదేపదే ఆ పాపలిద్దరివేపు మరల్చకుండా వుండలేకపోతోంది. ఏ ఆలోచనల నుంచి పారిపోవాలని బృంద దగ్గరకి వచ్చిందో అవే ఆలోచనలు వొదలటం లేదు. పైగా మరింత బలంగా గుర్తొస్తున్నాయి.

కూర్చున్నచోటనే వెనక్కి వాలింది ముక్త.

-చిన్నతనం. స్కూల్లో చదువుకునే రోజులు. మనసంతా ఆటల మీదా, ఆట బొమ్మల మీదా లగ్నమయ్యే వయస్సు.

స్కూల్లో పిల్లలు కబాడీ ఆడుతున్నారు. వొక జట్టులో తనూవుంది. తను కూతకి వెళ్ళింది - అవతలి జట్టు మీదకి -

"కబాడీ....కబాడీ....కబాడీ" - ఆలోచనలు మాత్రం ఇంటినీ, తండ్రినీ గుర్తుచేస్తున్నాయి. తననెవరో....."ఇల్లూ....ఇల్లూ.....ఇల్లూ...." అంటూ తరుముతున్నారు. ఆట సాధ్యంకావడం లేదు. తను అర్థాంతరంగా కూత ఆపేసి కబాడీ కోర్టు నుంచి పుస్తకాల సంచి వేపు పరిగెత్తింది.

"నువ్వెప్పుడూ ఇంతే! ఆట మధ్యలో వెళ్ళిపోతావ్. ఇలా అయితే రేపట్నుంచీ మాతో ఆడొద్దు"- నీరజ ఎత్తిపొడిచింది. అయినా వెళ్ళక తప్పదు. తను త్వరత్వరగా ఇల్లు చేరింది.

ఇంటికి వెళ్ళేసరికి అక్క పుస్తకాల ముందు కూర్చొనివుంది.

తనూ యూనిఫామ్ మార్చుకొని పుస్తకాలని ముందేసుకొని కూర్చుంది.

"ఆ ఆటలు ఆడకపోతేనేం? మీ నాన్న వచ్చే టైమ్‌కి ఇంటికి వొస్తావో లేదోనని తెగ కంగారుపడ్డాననుకో. మీ నాన్న సంగతి తెలుసుగా. త్వరగా రావొచ్చుగా" తను రావడం చూసి ఆతృత తగ్గిన గొంతుతో అన్నది తల్లి. తను పుస్తకాల ముందైతే కూర్చోగలిగింది కానీ మనసు చదువు మీద లేదు.

"ఆటలూ, బొమ్మలూ తిండిపెట్టవ్. బాగా చదువుకోవాలి. మంచి మార్కులు రావాలి" తండ్రి మాటలు లీలగా గుర్తొస్తున్నాయి.

ఇలాంటి మాటల మధ్యే తన చిన్నతనం గడిచింది.

ఆ మాటల వల్ల తను ఏం సాధించిందో తెలీదు.

కానీ కోల్పోయింది మాత్రం చాలనే వుంది.

గెలవగలనని నమ్మిన పోటీల నుంచి అర్థాంతరంగా తప్పుకోవడం ఎంత బాధాకరం!

తను వాలీబాల్ ప్లేయర్!

సర్వీస్ చేయడంలోనూ, ప్రత్యర్థులకు అందకుండా లిఫ్ట్ యివ్వడంలోనూ రెప్పపాటులో కట్ కొట్టడంలోనూ - టీమ్‌లో తనదే పైచేయి.

'ముక్త టీమ్‌కి గెలవడం తప్ప వోటమి తెలీదు' టీచర్లంతా ప్రశంసించేవారు. అయినా తనేం సాధించగలిగిందీ?

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు టీమ్‌ని ఎంపిక చేస్తున్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల నుంచీ విద్యార్థులు వొచ్చారు. ఉదయం నుంచీ సెలక్షన్స్ జరుగుతున్నాయి. ఆడిన ప్రతీ ఆటలోనూ తను గెలుపుని సొంతం చేసుకుంది.

ఇక టీమ్ ఫైనల్స్ సెలక్షన్ మాత్రమే మిగిలింది.

అప్పటికే తను యింటికి వెళ్ళాల్సిన సమయం మించిపోయింది.

అమ్మ మాటలు, నాన్న మందలింపులు చెవుల్లో మారు మోగుతున్నాయి. వెళ్ళాలా, ఆడాలా? తన నడక ఎటూ- ఇంటికా కోర్టుకా?

"వెళ్ళిపోతానని" డ్రిల్ టీచర్‌కి చెప్పాలంటే సిగ్గుగా అనిపించింది.

టీమ్ సెలక్షన్ ఆలస్యమయ్యేకొద్దీ మనసులో ఆందోళన తట్టుకోవడం కష్టంగా వుంది. తలపగిలిపోతోంది.

ఆఖరి నిమిషం - సరిగ్గా ఆఖరి నిమిషంలో మిగతా ప్లేయర్స్ వుత్సాహంగా ఆటకి సిద్ధమవుతుండగా తను వొక్కర్తీ ఎవరికీ చెప్పకుండా పుస్తకాల సంచి తీసుకుని యింటికి పరిగెత్తింది.

పరిగెత్తుతుంటే చెంపల మీంచి కన్నీళ్లు ధారలు కట్టేయి.

ఆ సంఘటన గుర్తురాగానే ముక్త కళ్లు చెమ్మగిల్లాయి - మళ్ళీ.

"ఏమైనా ఆర్డర్ చేస్తారా? ఎనీ డిజర్ట్" స్టీవర్డ్ అడుగుతుంటే అతని వేపు బ్లాంక్‌గా చూసింది ముక్త.

ఐస్‌క్రీమ్, ఫ్రూట్‌సలాడ్ - ఇవన్నీ లోపలి మంటల్ని ఆర్పుతాయి?

బిల్ చెల్లించి ముక్త కిటికీలోంచి బయటికి చూసింది.

కొద్దిగా కనిపిస్తున్న అరేబియా అలలు.

రెస్టారెంట్‌లోంచి బయటికొచ్చింది. ఏ.సీ. లోంచి బయటికి రావడంతో బయట ఎండ తీవ్రత వున్నదానికన్నా ఎక్కువనిపించింది. టాక్సీ డ్రైవర్‌కి అడ్రస్ చెప్పింది. మెరైన్ డ్రైవ్ మీద టాక్సీ స్పీడ్ లిమిట్‌తో పోతోంది.

హైదరాబాద్‌లో ఆటోలెక్కువ. ఇక్కడ ఆటోలే కనిపించవ్

ఎటు చూసినా టాక్సీలే!

డింపుల్ అపార్ట్‌మెంట్స్ ముందు టాక్సీ ఆగింది. లిఫ్ట్ దగ్గర పెద్ద క్యూ. ఆరో అంతస్తులో వున్న బృందఫ్లాట్ ముందు నిలబడి తన దగ్గరున్న కీతో తాళం తీసింది ముక్త. లోపలికొచ్చి హేండ్ బ్యాగ్ నేలదివాన్ పక్కన పడేసి దివాన్‌పై వాలిపోయింది. చెయ్యి చాపి ఫేన్ స్విచ్ వేసింది. బృంద ఆఫీసు నుంచి ఎప్పుడొస్తుందో తెలీదు. అప్పటివరకూ ముక్తకి కావలసినంత ఏకాంతం. ఈ ఏకాంతం కోసమే ఈ మధ్య తరచుగా బృంద దగ్గరకి వచ్చేస్తోంది. రిమోట్ చేతిలోకి తీసుకొని టివీ ఆన్ చేసింది. ఛానల్ వెంట ఛానల్ - బుల్లి తెరపై మారుతున్న దృశ్యాలు - పార్లమెంట్ న్యూస్. బాబ్డ్‌హెయిర్ ఆడవాళ్ళు ఆడవాళ్ళుకాదని వో నాయకుడు ఆవేశంగా మాట్లాడుతున్నాడు.

బాబ్డ్‌హెయిర్ ఆడవాళ్ళంటే జుట్టు కత్తిరించుకున్న వాళ్లు అనేకాదు అతని వుద్దేశం. డబ్బుండో, వుద్యోగాలు చేస్తునో వుద్యమాలు చేస్తునో స్వేచ్ఛగా, స్వతంత్రంగా కనిపించే స్త్రీల చుట్టూ కూడా ఎన్ని కంచెలున్నాయో వేషభాషలకే గుండెలు బాదుకునేవాళ్లకేం తెలుస్తుంది.

దృశ్యాలు చూపులని ఆకట్టుకోవడం లేదు. ఏ శబ్దమూ వినసొంపుగా లేదు. అయినా ముక్త టీవీని కట్టేయలేదు. దృశ్యం వెంట దృశ్యం - రకరకాల ఫ్రీక్వెన్సీలలో శబ్దాలు చుట్టుకొంటున్నాయి.

ముక్త తన చేతిలోని రిమోట్ వేపు చూసింది. చిన్న బటన్ నొక్కితే చాలు టీవీ ఆగిపోతుంది. 'అయినా నేనెందుకు నొక్కడం లేదూ? ఇష్టం లేకున్నా ఆ దృశ్యాలని శబ్దాలనీ ఎందుకు భరిస్తున్నాను' అనుకొంది ముక్త.

టీవీనే కాదు. తను చాలా భరించింది. భరిస్తోంది.

బాధాసందర్భాలు ఇప్పుడిప్పుడే గుర్తొస్తున్నాయి. ఎన్నెన్నో

గుర్తొస్తున్నాయి. అన్నయ్యలానే తనూ కాంపిటేటివ్ ఎగ్జామ్ పాసయింది. ఇంటర్వ్యూ బాగా చేసింది. కొద్ది నెలల తేడాతో యిద్దరికీ వుద్యోగాలు వచ్చాయి.

మొదటి నెల జీతం వొచ్చింది.

ఆ రోజు ఎంత సంబరం. అన్నయ్య తన తొలి జీతాన్ని అమ్మ చేతుల్లో పెట్టినట్టే తనూ ఆమె చేతిలో జీతం వుంచింది. అమ్మ కళ్ళల్లో ఎంత వెలుగు.

నెల తర్వాత నెల, తర్వాత నెలా ఇలా ఎన్నో నెలలు గడిచాయి. కానీ ఏం జరిగింది.

అన్న జీతం గురించి ఎప్పుడూ ఏ లెక్కాలేదు. వాడు ఎంత పాకెట్‌మనీగా తీసుకుంటే అంత, ఎంత ఇంట్లో యిస్తే అంత!

తను మాత్రం అణాపైసల్తో సహా ఇవ్వాలి. అవసరానికి మాత్రం అడిగి తీసుకోవాలి. లెక్కలు చెప్పాలి. ఏం కొనుక్కోవాలన్నా పర్మిషన్లు తీసుకోవాలి. బస్‌పాస్‌లు, ఆటో ఛార్జీలు, కేంటిన్ ఖర్చులు - ఇంతే. వీటికీ లెక్కాపత్రం వుండాలి. 'ఇంట్లో తెలీని ఖర్చులు ఆడపిల్లలకేం వుంటాయి' అమ్మానాన్నల సవరింపులు.

"సిన్మా కెళ్తారా? ఎక్కువ మందిని తీసుకెళ్ళకు. ఎవరి టిక్కెట్లు వాళ్ళే తీసుకోండి"

"పిక్నిక్ ఎందుకులేమ్మా? బోల్డంత ఖర్చు" ఇవే మాటలు ఏం అడిగినా.

ఎప్పుడైనా డబ్బులు గురించి అడిగితే -

"నీ సంపాదన మాకెందుకూ? నీ పెళ్ళి ఖర్చులకనే అకౌంట్‌లో వేస్తున్నాం" అని దబాయింపు.

ఏమనగలదు తనూ? తలవొంచుకొంది. నోటిలో మాటని నోటిలోనే దాచుకొంది. గుండెలో బాధని గుండెలోనే దాచుకొంది.

బాధని మాత్రమే దాచుకోగలిగింది. వొక్కపైసా దాచుకోలేకపోయింది.

అన్నయ్యకి వో యిల్లు. బ్యాంక్ అకౌంట్. మోటర్‌సైకిల్. కారు కూడా త్వరలో లోన్ తీసుకొని కొనుక్కోబోతున్నాడంట.

ముక్త గోడకి చేరగిలపడి బృంద యింటిని పరిశీలనగా చూసింది.

పొడవైన హాలు. స్టాండింగ్ కిచన్. హాలుకి ఆనుకొని వో బాల్కని.

ఆ హాల్లో గోడవారగా వో పరుపు పర్చివుంది. పరుపుపై మహారాష్ట్ర చేనేత దుప్పటి పరిచి వుంది. రెండు దిళ్ళు. దిళ్ళ పక్కనే కప్పుకోటానికి దుప్పటి. మరోవారగా దివానుపరుపు. దిళ్ళు వేసున్నాయి. నేలమీదే కూర్చుని చూడటానికి వీలుగా పోర్టబుల్ టి.వి. వో వైపు ఫ్రిజ్, ఇస్త్రీపెట్టె. గ్యాస్ స్టవ్. కుక్కర్. క్యారమ్‌బోర్డ్. అనవసరంగా ఆ యింట్లో వొక్క స్పూన్ కూడా లేదు. కావల్సినంత సామాను. సింపుల్‌గా క్యూట్‌గా వున్న ఆ యింటిలో ముక్తని ఎప్పుడూ ఆకర్షించేవి గోడల మీద పెయింటింగ్స్. ఎంతో నచ్చిన లక్ష్మణ్ ఏలే పెయింటింగ్‌ని కాసేపు చూస్తుండిపోయింది.

దాహం వేస్తుంటే లేచి వెళ్ళి మంచినీళ్ళు తాగింది. కిచెన్‌లోకి వెళ్ళి టీ కలుపుకొని తిరిగి హాల్లోకి వచ్చింది. బృంద అల్లుతూ అల్లుతూ మధ్యలో వొదిలిన స్వెటర్ తీసుకొని అల్లటం మొదలుపెట్టింది.

ఏడవుతుంటే బృంద వచ్చింది.

బృంద ముఖం కడుక్కుని వచ్చేలోగా టీ చేసింది ముక్త.

"థ్యాంక్‌యూ. మధ్యాహ్నం ఏమైనా తిన్నావా" టీ కప్పు అందుకుంటూ అడిగింది బృంద.

"నీ ఫేవరెట్ రెస్టారెంట్‌కి వెళ్ళాను"

"అంబాసిడార్"

"ఆఁ"

"రేపు ఆదివారం కదా. ఎక్కడికైనా వెళదామా" అడిగింది బృంద.

"వూ"

"ఎలిఫెంటా కేవ్స్‌కి పోదామా"

"మనిద్దరమే"

"మనిద్దరమే ఏంటి? నేనొక్కదాన్ని కూడా వెళతాను తెలుసా? ఏం చేసుకుందాం డిన్నర్‌కి" అడిగింది బృంద.

తను వొక్కర్తి వున్నప్పుడు కూడా యింట్రస్టింగ్‌గా వంట చేసుకుంటుంది బృంద.

"వెజిటబుల్ బిర్యాని చేద్దామా" అడిగింది బృంద.

"వూఁ"

కూరలు, చాకు, పీలర్ తీసుకొని బాల్కనిలోకి వెళ్ళారు.

బంగాళదుంపల చెక్కు తీస్తు "మీ ఇంటికి నువ్వెప్పుడైనా వెళతావా" అడిగింది ముక్త.

"వూ"

"మీ పేరెంట్స్, అక్కలు, అన్నలు చాలామంది ఈ సిటీలోనే వున్నారు కదా. అయినా వాళ్ళతో కలిసి లేకుండా ఇలా వొంటరిగా వుండటానికి మీవాళ్ళు వొప్పుకున్నారా" అడిగింది ముక్త.

"మొదట్లో వొప్పుకోలేదు. రెండేళ్ళు వాళ్ళతోనే వున్నాను. నా వల్లకాలేదు" అంది.

"అంటే" ఆతృతగా అడిగింది ముక్త.

"మొదట్లో నా ఆఫీసుకి అన్నయ్యవాళ్ళ యిల్లు దగ్గరని వాళ్ళింట్లో వుండమన్నారు. ఉదయం లేచి వదినకి వంటలో సాయం చేయటం. వాళ్ళ పిల్లల్ని స్కూల్‌కి రెడీ చేయటం. హడావుడిగా ఆఫీసుకి పరిగెత్తడం. సాయంత్రం యింటికి వచ్చేసరికి పిల్లలతో హోమ్‌వర్క్ చేయించటం. వాళ్ళిద్దరూ పిల్లల్ని నాకు అప్పచెప్పేసి సినిమాలకి, పార్టీలకి పిక్‌నిక్స్‌కి, ఫ్రెండ్స్ యిళ్ళకి వెళ్ళిపోయేవారు. నేను ఎక్కడికైనా వెళ్ళాలన్నాననుకో, అరే మేం సినిమాకి వెళ్లాలనుకున్నాం. మిసెస్ జోషి ఫ్యామిలికి చెప్పాం అనో మరోటో అనేవారు. ఏడాది వాళ్ళ పిల్లల్ని పెంచాను. ఎప్పుడైనా అయితే పర్లేదు. రోజూ పిల్లల్ని చూడాలంటే భలే కష్టం. వాళ్ళింట్లో వుంటున్నందుకు ప్రత్యేకంగా డబ్బులు తీసుకునేవారు కాదు. కాని నా జీతమంతా ఆ

ఇంట్లో పిల్లల బట్టలకో, స్కూల్‌ఫీజ్‌కో, పుట్టినరోజుల సంబరాలకో, పండుగలకో ఖర్చు అయిపోతుండేది. 'నువ్వీ ఖర్చు భరించు' అని స్పష్టంగా చెప్పరు. కానీ డబ్బులు ఇచ్చేట్టు ప్రవర్తించేవారు. నాకోసం టైమ్ మిగిలేది కాదు. ఇలా పిల్లల కోసం ఖర్చు చేసినందుకో, టైమ్, స్పేస్, మనీ అని బాధపడటం చూసి 'అదేంటి వాళ్లేమైనా పరాయి పిల్లలా, అన్నపిల్లలే కదా' అంటారు. 'అన్నలకి, పిల్లల్ని కూడా కాదనుకొనే మీరేం మనుష్యులూ' అంటారు. ఏం చెయ్యాలని ఆలోచించేసరికి మరో ఏడాది గడిచిపోయింది. చివరికి నాకంటూ నేను వో స్పేస్‌ని క్రియేట్ చేనుకోటానికే నిర్ణయించుకున్నాను. వర్కింగ్ విమెన్ హాస్టల్‌కి వెళ్ళాను. అక్కడ్నుంచి వో గదిలో అద్దెకి వుంటూ ఇదిగో చివరికి ఈ సొంత ఇంటిని ఏర్పాటు చేసుకున్నాను. నయాపైసా సాయం చేయనని పిసినారినని అక్కలు, అన్నలు, బంధువులు అంటుంటారు. అలా అని వాళ్ళందరి ముఖాలు చూడనని కాదు. ఇవ్వాలనిపించినప్పుడు నాకు వీలుగావుంటే వాళ్ళకి గిఫ్టు యిస్తాను. పుట్టినరోజులప్పుడూ పండుగలప్పుడూ గ్రీట్ చేస్తాను. పిల్లలకి హాలిడేస్ యిచ్చినప్పుడు వాళ్ళని తీసుకొని బయటికి వెళతాను. అక్కలకి, అన్నయ్యలకి వుద్యోగాలున్నాయి. వాళ్ళ సంపాదన కంటే ఎక్కువ ఖర్చులు చేస్తు వాటిని నన్ను భరించమంటే భరించను. మా నాన్నమ్మకి మాత్రం ప్రతి నెలా కొంత డబ్బు పంపిస్తాను. తాతగారికి వచ్చే పెన్షన్‌తోనే ఆమెకి ఆదాయం" అంది బృంద.

"వాళ్ళంతా నిన్ను అలాంటి మాటలు అంటుంటే నీకు బాధగా వుండదా"

"ఉండేది. రానురాను వాళ్ళంతే. నేనింతే. అందరి మాటలకి రియాక్ట్ అవ్వటం మొదలుపెడితే చివరికి మనకి మనమే మిగలం? ఎనీ ప్రాబ్లమ్? ఎప్పుడూలేంది ఇలాంటి ప్రశ్నలు వేస్తున్నావ్" అడిగింది బృంద.

ముక్త ముఖమంతా అవ్యక్తమైన బాధ.

"అక్కావాళ్లు ఇల్లు కట్టుకుంటారంట. నన్ను ఆఫీసునుంచి లోన్ తీసి ఇమ్మని బావగారు అడిగారంట. 'మా ఇంట్లో అమ్మాయిలా చూసుకుంటున్నాం. ఆ మాత్రం యివ్వలేవా? ఈ యిల్లు నీది కాదా

ఏంటి? ఎప్పటికైనా మేమే కదా నీకు? నా పిల్లలే కదా ఎప్పటికైనా నిన్ను చూసుకొనేది, నువ్వు పెద్దదానివయ్యాక' అంటున్నారు. ఉద్యోగంలో చేరినప్పట్నుంచి వాకేవూరిలో వుంటూ నువ్వు బయట వేరే వుంటే బాగుండదని వాళ్ళింట్లోనే వుండమన్నారు. అలా గత కొన్నేళ్ళుగా ఆ ఇంట్లోనే వున్నాను. నా కంటూ వో పైసా మిగల్లేదు. నా కంటూ ఆ బట్టలు తప్పా మరో వస్తువు సమకూర్చుకోలేదు. పైగా వాళ్ళింట్లోని ఫ్రిజ్, వాషింగ్‌మెషిన్ వాక్యూమ్‌క్లీనర్ లాంటివి ఇన్‌స్టాల్‌మెంట్‌లో తీసుకున్నారు. ఆ కార్డ్సు అన్నింటిపై నాతో సంతకాలు చేయించారు. అవి ప్రతి నెలా పే చెయ్యాలి. ఏమైనా అంటే ఈ పిల్లలు నీ పిల్లలు కారా అంటారు. నాకు వూపిరాడటం లేదు. పైగా నాకంటూ ఈ రోజువరకు స్నేహితులు లేరు తెలుసా. కాలేజ్ రోజులతోనే స్నేహాలు ఆగిపోయాయి. వోసారి మా ఆఫీసులో అమ్మాయి నాకాస్త దగ్గరగా వచ్చింది. అప్పుడప్పుడూ ఇంటికి వచ్చేది. మా ఇద్దరం ఏకాంతంగా మాట్లాడుకోవటానికి వీలయేది కాదు. ఆఫీసు నుంచి యింటికి ఆలశ్యంగా వస్తే బోల్డన్ని ఎక్స్‌ప్లనేషన్స్ యివ్వాలి. సినిమాలకైనా, ఎక్కడికి వెళ్ళినా ఇంట్లోవాళ్ళతోనే వెళ్ళాలి. అలా ఇంటికొచ్చే అమ్మాయితో ఇంట్లోవాళ్ళు తగాదా పెట్టుకొన్నారు. అప్పట్నుంచి నిజానికి యిక్కడికి నీ దగ్గరికి వచ్చినప్పుడు కూడా ఆఫీసుపని అని చెప్పాల్సివస్తోంది. మొదటిసారి నీ దగ్గరికనే వచ్చాను. అప్పుడు యింట్లో పెద్ద గొడవ జరిగింది. నువ్వు తాగుతావన్నారు. అందర్నీ వదిలి వేరే ఇంట్లో వుంటావన్నారు. నీ చెడ్డతనాలన్ని హితబోధ చేసారులే. నువ్వు నాకు రాసిన వుత్తరాలు వాళ్ళు చదువుతున్నారని అర్థమయింది. అప్పట్నుంచి వాటిని ఆఫీసులో టేబుల్ డ్రాలో పెట్టి లాక్ చేస్తున్నాను" అంది ముక్త.

కట్ చేసిన కూరకాయముక్కలని వంటింట్లోకి తీసుకువెళుతూ "నువ్వు పెళ్ళి చేసుకోకూడదనుకున్నావా? లేక కాలేదా" అడిగింది బృంద.

"అంటే"

"నే పెళ్ళి చేసుకోకూడదనుకున్నాను. నువ్వేం అనుకున్నావ్?" అని అడిగింది బృంద.

"చదువుకునేరోజుల్లో వుద్యోగంలో జాయిన్ అయిన మొదట్లో పెళ్ళి చేసుకోకూడదని నేనేం అనుకోలేదు. నీ కట్నం కోసం జీతం దాస్తున్నాం అనేవారు. వాళ్లే ఏదో వొక సంబంధం చూసి పెళ్లి చేస్తారేమో అనుకున్నాను" అంది ముక్త.

"నీకు చేసుకోవాలనివుంటే ఇప్పుడు నువ్వే నీకు నచ్చినవాళ్లెవరినైనా చేసుకోవచ్చుగా"

"పెళ్ళా?! వద్దు.ఇప్పుడు పెళ్లి చేసుకోవాలనే ఆలోచన లేదు బృందా"

"ఏం"

"ఇంతమందిని చూస్తున్నానుగా. అందులోని యిరుకు బానే అర్థం అయింది. పెళ్ళి చేసుకునే ధైర్యం లేదు. ఆ జంజాటంలోకి వెళ్ళాలని లేదు" అంది ముక్త.

"నువ్విప్పుడా జంజాటంలో లేవా" కుక్కర్ స్టవ్ మీద పెడుతూ అడిగింది బృంద చిన్నగా నవ్వుతూ.

ముక్త బృంద వేపు వో క్షణం చూసి "నువ్వు నిజంగానే పెళ్ళి చేసుకోమనే అంటున్నావా" అడిగింది.

"పెళ్లి చేసుకోవటమో లేదో నీ యిష్టం. పెళ్ళి వద్దు అనుకుంటే ఎందుకొద్దను కుంటున్నామో మనకి తెలియాలికదా. ఎలాంటి జీవితాన్ని కావాలనుకుని పెళ్ళి చేసుకోకూడదని నిర్ణయించుకున్నామో అలాంటి జీవితాన్ని నిర్మించుకోటానికి ప్రయత్నించాలి కదా" అంది బృంద.

"బాప్‌రే! పెళ్ళా?! వద్దు. కోరి కష్టాలు తెచ్చుకోవటమే అవుతుంది" అంది ముక్త.

కుక్కర్ మూతపై వెయిట్ పెట్టి బాల్కనిలో గోడకి ఆనుకొని నిలబడుతూ "పెళ్ళి అనేది మనకి కాస్త వయసొచ్చాక, జ్ఞానం వచ్చాక జరుగుతుంది. సో మనం అందులోకి వెళ్లాలో అక్కర్లేదో నిర్ణయించుకొనే అవకాశం వుంది. ఆ వొక్క బంధుత్వాన్ని వద్దనుకున్నంత మాత్రాన మనం కుటుంబానికి దూరంగానో, వెలుపలో వున్నట్టేనా? మనకి ఇష్టం వున్నా లేకపోయినా అందులోనే పెరుగుతాం. ఆ కుటుంబం నుంచి మనం

దూరంగా ఎలా వెళతాం? కుటుంబం అంటే భార్యభర్తా సంబంధాలే కాదు కదా. అమ్మ, నాన్న, అన్న, అక్క, తమ్ముడు, వదిన సంబంధాలుంటాయి కదా. ఈ బంధుత్వాలని మోర్ డెమక్రటిక్‌గా, మరింత స్నేహపూరితంగా ఎలా మలచుకోవాలి? న్యూక్లియర్ ఫ్యామిలీస్ వచ్చినప్పటికి మనిషికి మనిషికి మధ్య సంబంధాలలో బాధ పోలేదుగా. సింగిల్ వుమన్‌గా జీవితం సాగించాలని మనం అనుకున్నప్పుడు ఇంట్లోని ఎవరైతే మనల్ని బలంగా వ్యతిరేకిస్తారో వాళ్లే కొంతకాలం గడిచేటప్పటికి మనం తిరిగి ఏ కొత్త స్నేహాల్లోకీ వెళ్ళకుండా చూస్తారు. మనం అలా వొంటరిగా వుండిపోవాలను కుంటారు. వాళ్ళకది లాభం. వాళ్ళ పిల్లల్ని, ఖర్చుల్ని, కోరికల్ని, ఆశల్ని కన్వీనెంట్‌గా మనపై తోసేస్తారు. వీటి నుంచి బయటపడటం ఎలా? 'భర్త' అనే మగవాని పెత్తనాన్ని వద్దనుకుంటే ఎలానోలా వదిలించుకోవచ్చు. మరి ఈ ఇంట్లోవాళ్ల అధికారాన్ని పెత్తనాన్ని, నిరంకుశత్వాన్ని ఎలా వదిలించుకోవాలి? వూహ రానికాలం నుంచి వాళ్ళందరితో మన జీవితం పెనవేసుకుపోతుంది కదా. అనుబంధముంటుంది. ప్రేముంటుంది. బోల్డంత సెంటిమెంట్ ముడిపడి వుంటుంది కదా. వీళ్ళతో పోరాటం కష్టం. అందులోంచి బయటపడే రోజుల్లో ఎంతలా బాధపడ్డానో? రోజూ ఏడవటమే. పెళ్ళి వద్దన్నామంటే సర్వసంగపరిత్యాగం చేస్తున్నామనో, సొంత జీవితం వుండదనో అనుకుంటారు. సంపాదనని, శ్రమని, సమయాన్ని అందరికి పంచిపెట్టేస్తు బ్రతికేస్తాం అనుకుంటారు. పెళ్ళి లేకుండా కూడా జీవితం వుంటుందని జీవితాన్ని నిర్మించుకునే కలలుంటాయని వాళ్ళకు అర్థం కాదు" అంది బృంద.

"ఇందులోంచి ఎలా బయటపడాలి" అని అడిగింది ముక్త.

"ఏమో" అన్నట్టు బృంద భుజాలు ఎగరవేసింది.

ఇద్దరూ ప్లేట్లలో బిర్యానీ వడ్డించుకున్నారు.

బిర్యానీని ముక్త పరధ్యానంగా తినటం చూసి బృంద "ఎలా వుంది" అడిగింది.

"వూ(....బాగుంది"

స్టార్‌న్యూస్ వస్తోంది.

బృందకి ప్రణయ్‌రాయ్ న్యూస్‌ని ప్రజెంట్ చేసే తీరు చాలిష్టం. యాడ్ రాగానే కిచెన్‌లోకి వెళ్ళి ఇంకాస్త బిర్యాని వేసుకొని "వేయనా" ముక్తని అడిగింది.

అనురాధ వెదర్‌ఫోర్‌క్యాస్ట్ చెపుతోంది.

"భలే చెపుతుంది కదా, రహస్యాలు చెప్తున్నట్టు" అంటూ ప్రణయ్‌రాయ్ కంటే ముందు "థ్యాంక్‌యూ అనురాధా" అతనిని ఇమిటేట్ చేస్తూ అంది బృంద.

"భలే ఇమిటేట్ చేస్తున్నావ్" అంది ముక్త నవ్వుతూ.

ఎక్కడ గిన్నెలు అక్కడ సర్దేసారు.

"నిద్రొస్తుందా" అడిగింది బృంద.

"లేదు"

"క్యారమ్స్ ఆడదామా"

"వూ("

క్యారెమ్స్ ఆడుతున్నారు. ముక్తకి అక్క ముఖం గుర్తొస్తుంది. స్కూల్‌కి ఇద్దరు కలిసి వెళ్ళటం. తన టిఫిన్ బాక్స్ మోసే అక్క. లంచ్ పీరియడ్‌లో తన బాక్స్‌లోని టిఫినో, అన్నమో పూర్తిగా తినేట్టు చూసే అక్క. తన బుగ్గలని ముద్దంటూ తోటి పిల్లలో పెద్దలో గిల్లుతుంటే పోట్లాడే అక్క గుర్తొచ్చింది. తనకి నచ్చిన బట్టలు ఇచ్చేసే అక్క పెద్దయ్యాక కూడ తనకి కుంకుడురసంతోనే తలంటే అక్క. ఆఫీసు నుంచి రాగానే కాఫీ అందించి టిఫిన్ పెట్టే అక్క. జ్వరమొచ్చినా,తలనొప్పి వచ్చినా తల్లడిల్లిపోయే అక్క- అలాంటి అక్కతో 'ఇంటికి లోన్ తీసుకొని ఇవ్వలేనని ఎలా చెప్పటం'? తన చుట్టూ అప్పులు, తనకంటూ లేని జీవితం. బంధుత్వాల కంచె. పెళ్ళి, పిల్లలు, లేనంత మాత్రాన నాకంటూ వో యిల్లు ఏర్పర్చుకోకూడదా? వద్దంటూ ఎందుకలా గగ్గోలు పెడతారో? నాకంటూ వో వుద్యోగమే లేకపోతే

వీళ్ళంతా నన్ను వాళ్ళ వాళ్ళ యిళ్ళల్లో వుండమని వొత్తిడి చేసేవారా? కుటుంబ సంబంధాల్లో వుండేది నిజంగా ప్రేమ, ఇష్టమే అయితే ఎవరి యిళ్ళల్లో వాళ్ళు వున్నప్పటికి అవి అలానే వుండాలి కదా? ఎందుకిన్ని ఆలోచనలు అనుకుంటూ "ఈ సిటీలో మన ఆఫీసు బ్రాంచ్ వుంది కదా. ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ పెట్టుకుంటాను"–క్రిస్టల్ క్లియర్ వాయిస్‌తో అంది ముక్త.

"కంగ్రాట్స్. విముక్తమవుతోన్న ముక్త" అంటూ నవ్వింది బృంద.

"విముక్తా!? అప్పుడే ఎక్కడా" అని నవ్వుతూ అంది ముక్త.

